క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సౌమ్యగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

భీమునిపట్నం : గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం స్థానిక భక్తులు సౌమ్యగిరి ప్రదక్షిణ చేశారు. ముందుగా లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో మెట్ల మార్గం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి భక్తులు నేరెళ్లవలస కాలనీ మీదుగా ఎనిమిది కిలోమీటర్ల దూరం సౌమ్య గిరి చుట్టూ ప్రదక్షిణ చేశారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ 105 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు వి.లక్ష్మణరావు, వి.శ్రీనివాసరావు, వి.తాతాజీ, ఎం.శంకర్, కిశోర్, సాయి పాల్గొన్నారు.

పోలమ్మకు సారె సమర్పణ



చిట్టివలస పోలమ్మ తల్లి ఆలయం వద్ద సారెతో చిల్లపేట గ్రామస్తులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేట గ్రామస్తులు చిట్టివలసలోని వారి గ్రామ దేవత పోలమ్మకు ఆదివారం సారె సమర్పించారు. బాణసంచా, కోలాటం, డీజేలతో చిల్లపేట నుంచి చిట్టివలస వరకు అమ్మ వారికి ఊరేగింపుగా పండ్లు, స్వీట్లు, పిండి వంటలు తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

నిరాశ్రయుడికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



నిరాశ్రయుడిని షెల్టర్‌కు తీసుకొస్తున్న మమత

విశాఖ విద్య: ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తికి ఆదివారం బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. పరవాడ ఏరియాలో ఫుట్‌పాత్‌పై కొన్ని రోజులుగా ఓ వ్యక్తి ఉంటున్నాడనే సమాచారంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న అతనికి ఎవరూ లేరని తెలుసుకొని సపర్యలు చేసి షెల్టర్‌కు తీసుకొచ్చారు. మతిస్థిమితం కూడా సరిగా లేకపోవడంతో అతనికి అవసరమైన వైద్యం అందించే ఏర్పాట్లు చేసినట్లు మమత తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జాతీయ రహదారి బస్‌స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆగని ఆక్రమణల పర్వం

- చంద్రంపాలెం ఎన్జీవో కాలనీ, ఐటీ సెజ్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో షెడ్లు
- ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం
- ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు



మిథిలాపురి వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డుకి సమీపంలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్



చంద్రంపాలెం శ్మశానవాటిక వద్ద ఆక్రమణకు సిద్ధం చేసిన ప్రభుత్వ స్థలం

మధురవాడ : విశాఖ రూరల్ మండలంలో ఆక్రమణల పర్వం ఆగడం లేదు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా చేసేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి టీడీపీ నాయకుల అండతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. మరోవైపు ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువైన ప్రభుత్వ భూములు హారతి కర్పూరంలా అన్యాక్రాంతమైపోతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తున్నారు. శ్రీలక్ష్మినగర్, శారదానగర్, మధురవాడ వికలాంగుల కాలనీలో టీడీపీ నాయకుల అండతో జరుగుతున్న ఆక్రమణలను అధికారులు కనీసం పట్టించుకోలేదు సరికదా అక్రమార్కులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తాజాగా మధురవాడ రెవెన్యూ గ్రామం చంద్రంపాలెం శ్మశాన వాటిక ఎన్జీవో కాలనీ దగ్గర టీడీపీ నాయకులు, వారి అనుచరులు సుమారు రూ.10 కోట్ల విలువ చేసే 400 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి షెడ్లు వేసేందుకు సర్వం సిద్ధం చేశారు. వారి మధ్య పంపకాల్లో తేడా రావడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో జీవీఎంసీ, రెవెన్యూ సిబ్బంది వచ్చి సర్వే చేసి తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి వెళ్లిపోయారు. కనీసం హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయకుండా బేరసారాలు సాగిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి.

వుడా కాలనీ రోడ్డులోనూ...

మిథిలాపురి వుడా కాలనీ – ఐటీ సెజ్ రోడ్డులో రమ్య ప్యారడైజ్ వద్ద గల మధురవాడ సర్వే నెంబరు 277లో ప్రభుత్వ భూమిలో షెడ్లు జోరుగా నిర్మిస్తున్నారు. ఇది అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూమిగా ఉంది. సుమారు రూ.5 కోట్ల విలువ చేసే 200 గజాలు 22ఏ జాబితాలో ఉన్న భూమి ఆక్రమణను అధికార టీడీపీకి చెందిన కొందరు నాయకులు తెర వెనుక నుంచి నడిపిస్తున్నారు. ఇంత విలువైన భూమి అన్యాక్రాంతమైపోతున్నా అధికారులకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం గమనార్హం.

సచివాలయ సెక్రటరీలు, వీఆర్‌వోలే...

మధురవాడ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఆక్రమణల వెనుక టీడీపీ నాయకులతోపాటు జీవీఎంసీ ప్లానింగ్ సెక్రటరీలు, సెకండరీ గ్రేడ్ వీఆర్‌వోలు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారులే తెర వెనుక నుంచి అంతా తామై నడిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కోసారి ఆక్రమణల విషయంలో ఉన్నతాధికారుల ఒత్తిడితో తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి మమ అనిపించేస్తున్నారు. ఈ రెండుచోట్ల ఆక్రమణ వ్యవహారాన్ని సచివాలయ వీఆర్‌వో సూర్య దృష్టికి తీసుకెళ్లగా అది ప్రభుత్వ భూమి అని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదానం చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం : రక్తదానం ఎంతో గొప్ప విషయమని, తద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని భీమిలి నీడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కైతవల్లి శ్రీనివాసరావు అన్నారు. కీతిన్‌పేటలో అసోసియేషన్, యరబాల చారిటీ సమయుక్తంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో అవసరమైన వారికి తమ వంతు సాయం అందివ్వడానికి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యరబాల చారిటీ చైర్మన్ యరబాల ప్రసాద్ మాట్లాడుతూ తరచూ ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసి అవరమైన వారిని వెంటనే ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 80 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు బ్లిస్ క్యాటరింగ్స్ ఎండీ లక్ష్మీ లావణ్య బహుమతులు అందించారు. గంటా నూకరాజు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్ని, ఎ.కిశోర్, ఆర్.బసవ కృష్ణమూర్తి, ఎం.ఆదిత్య, వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకూ ఆందోళన చేస్తాం



బక్కన్నపాలెం హుద్ హుద్ కాలనీలో నిరసన తెలుపుతున్న రైతులు, సీపీఎం నాయకులు

- హుద్‌హుద్ కాలనీ వద్ద కొనసాగిన రైతుల నిరసన

మధురవాడ : భూములు కోల్పోయిన కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం ప్రాంతాల రైతుల సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తారని సీపీఎం నాయకులు డి.అప్పలరాజు అన్నారు. రెండో రోజు ఆదివారం కూడా బక్కన్నపాలెంలోని సినీ పరిశ్రమ నిర్మించిన హుద్‌హుద్ కాలనీ వద్ద రైతులు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు చాలా నిర్లక్ష్యంగా చూడడంతోపాటు వారితో రోజుకో విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. బాధిత రైతులకు కనీసం కాలనీ ఇళ్లయినా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సియాద్రి పైడితల్లి, రైతు సంఘం పెద్దలు బి.పోతురాజు, ఎస్.పైడిరాజు, నాగేశ్వర్, అప్పారావు, కాంతం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సేవా కార్యక్రమాలు



వైఎస్సార్‌సీపీ నాయకులు అందించిన ఆహారం స్వీకరిస్తున్న బాలలు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం భీమిలి మండలం తాళ్లవలసలోని భరోసా లిటిల్ హగ్స్ అనాథ బాలల సంరక్షణ కేంద్రంలో చిన్నారులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు చిల్ల బాబయ్య రెడ్డి, వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల నరసింగరెడ్డి, పీతల రాజారావు, ఎరుసు అప్పారావు, చేట్ల అప్పలసూరమ్మ, శీరపు నరసింహారావు పాల్గొన్నారు.

తీరంలో మత్స్యకారుల ఆకలి కేకలు



వర్షాలతో వేట సాగక తీరానికే పరిమితమైన మత్స్యకారుల వలలు

కొమ్మాది : గత ఐదు రోజుల నుంచి తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు మత్స్యకారులు వేటకు పూర్తిగా విరామం ప్రకటించారు. ఇప్పటి వరకు అన్ సీజన్ కావడంతోపాటు అప్పులు చేసి మరీ బోట్లను, పడవలను, వలలను కొని, మరి కొన్ని మరమత్తులు చేసుకుని వేటకు సిద్ధమయ్యారు. ఇంతలోనే తుఫాన్ రావడంతో ఐదు రోజుల నుంచి వేట సాగక మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని తీర ప్రాంత మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ సమయంలో కూటమి నాయకుల ఏ ఒక్కరూ ఇటువైపు చూడలేదని, సహాయక చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వాతావరణం అనుకూలించక పోవడంతోపాటు తుఫాన్ ప్రభావం కొనసాగడంతో మరో రెండు రోజులు ఇంటికే పరిమితమవ్వాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ చదువులు అంతంతే..


- కేంద్రాలకు ఇంకా చేరని పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే బోధన
- ప్రైవేట్ స్కూళ్ల వైపు తల్లిదండ్రుల చూపు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న టీచర్



పీపీ - 1 పుస్తకం



పీపీ - 2 పుస్తకం

పెదగంట్యాడ: బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మలు, పుస్తకాలను ఆయా కేంద్రాలకు అందజేసేది. కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆంగ్ల బోధన అందించాలనే ఉద్దేశంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ – 1, పీపీ – 2 కిట్లు అందించింది. ఈ కేంద్రాల్లో ప్రైవేట్ స్కూల్ తరహాలో ఆంగ్ల బోధన అందించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఆసక్తి చూపేవారు. బోధనకు సంబంధించి 2 నుంచి 4 ఏళ్లలోపు చిన్నారులకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ – 1 కిట్లు, 4 నుంచి 5 ఏళ్ల వయసు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ – 2 కిట్లు అందించేవారు.

పాత పద్ధతిలోనే బోధన

పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి పెదగంట్యాడ సెక్టార్‌లో 25 కేంద్రాలు ఉండగా ఇస్లాంపేట సెక్టార్ పరిధిలో 26 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో సుమారు 3 వేల మంది వరకూ చిన్నారులు ఉన్నారు. వీరికి ఇప్పటి వరకూ పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలు నేటి వరకు అందకపోవడంతో పాత పద్ధతిలోనే పాఠాలు బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా కొత్త ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. గత ప్రభుత్వంలో సకాలంలో పుస్తకాలు అందించడంతోపాటు వాటిలో చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండడంతో తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. నేడు పుస్తకాలు రాకపోవడంతో ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లలో చేర్పించడానికి సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని బాలల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పుస్తకాలు రాలేదు

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త పుస్తకాలు ఇంకా ప్రభుత్వం నుంచి రాలేదు. పాత పుస్తకాలలోని కొంతమేర సిలబస్ మార్చే అవకాశం ఉంది. పుస్తకాలు వచ్చిన వెంటనే అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తాం. ప్రస్తుతం కేంద్రాల్లో ఉన్న పుస్తకాలతోనే చిన్నారులకు బోధిస్తున్నాం

–నీలవేణి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



శేరిఖండంలో సాయినాథుని పల్లకీ సేవలో భక్తులు



చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న అర్చకులు



శ్రీ శృంగేరీ శంకర మఠంలో అలంకరణలో ఆది శంకరాచార్యులు

తగరపువలస : గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం కార్మికవాడలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు స్వామి యోగానంద ప్రార్థన మందిరంలో గురుమాత పత్రి ఎల్లయ్యమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ పత్రి శివానంద కార్యక్రమాన్ని ప్రారంభించి పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు కాళ్ల శ్రీనివాస్, పిట్ట వెంకటరావు, సమితి సభ్యులు సత్యానంద, దినకర్, రాజు, కాళ్ల పురుషోత్తం, ఉప్పల రమేష్ పాల్గొన్నారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో అర్చకుడు ఆకెళ్ల రవి గణేష్ ఆధ్వర్యంలో బాబాకు ప్రత్యేక సేవలు చేశారు. 2 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. మెయిన్ రోడ్డులోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో బాబాకు ప్రత్యేక అర్చనలు అనంతరం అన్నాభిషేకం నిర్వహించారు. 2 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం బాబాకు పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో కొప్పల కృష్ణ, పోతురాజు, సన్యాసిరావు, మొండి కృష్ణ, పూర్ణ, శంకర్, భాను, నాగరాజు పాల్గొన్నారు. సంగివలస, సంతపేట, నమ్మివానిపాలెం తదితర షిర్డీసాయిబాబా ఆలయాలతోపాటు వెంకటేశ్వరమెట్టపై శ్రీలక్ష్మి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని రామాలయంలో గల సాయినాథునికి భక్తులు అన్నాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు.

పీఎం పాలెం : స్థానిక శ్రీ శృంగేరీ శంకర మఠంలో ఆదివారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మఠంలోని ఆది శంకరాచార్యుల ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శంకరాచార్యుల ప్రతిమను పుష్పాలు, సుగంధ మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. మఠం గౌరవ ధర్మాధికారి జె.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో భక్తులు పూజలు చేశారు. పీఎం పాలెం లక్ష్మీవానిపాలెంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో బాబాకు పూజలు చేశారు. వుడా రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయి ఆలయాలు, రెడ్డిపల్లి, శేరిఖండం గ్రామాల్లోని షిర్డీ సాయి ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శేరిఖండంలో పల్లకీ సేవ నిర్వహించారు. రెడ్డిపల్లిలో అన్నదానం చేశారు.

మధురవాడ: మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠం ఆవరణలో ధర్మకర్త నరసింహమూర్తి, కమిటీ సభ్యులు సతీష్, సూర్యప్రకాశరావు, ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల శ్రీ లలిత త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త బొద్దేపల్లి సురేష్, ప్రతాపరాజు, జేడీ నాయుడు, స్వతంత్రనగర్‌లో ప్రధాన అర్చకులు అధికార్ల కాళిదాసు ఆధ్వర్యంలో పూజలు చేశారు. వికలాంగుల కాలనీ సాయిబాబా మందిరంలో రమణమూర్తి, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్ పూజలు చేశారు.

చంద్రంపాలెంలో అన్న సమారాధన చేపట్టారు. శ్రీ దుర్గాలమ్మ సంక్షేమ సేవా సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, సభ్యులు పీవీజీ అప్పారావు, అన్నమయ్య, ఎస్ఎన్ మూర్తి, పోతిన పైడిరాజు, పోతిన శివ, పిళ్లా మోహన్ శివకృష్ణ, గూడేల రాజు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా రమణ మూర్తి, పిళ్లా అప్పన్న, జగ్గుపిల్లి అప్పారావు పాల్గొన్నారు. స్వతంత్రనగర్‌లో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

తగరపువలస : ఆనందపురం మండలం పందలపాక షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త జి.వరలక్ష్మి, పోతిన గోవిందరావు ఆధ్వర్యంలో భక్తులకు వసతులు, అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఆలయ అర్చకుడు ఆనందరావు, పోతిన లక్ష్మణరావు, దివ్య, మరుపిల్ల గురునాయుడు, గురువులు, పిళ్లా వెంకట అప్పారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద



చంద్రంపాలెంలో సాయినాథునికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు



పందలపాకలో అన్నదానం ప్రారంభిస్తున్న మజ్జి వెంకటరావు, తదితరులు

220 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం : పద్మనాభం పంచాయతీ అర్చకునిపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు శ్రీకాంత్, శ్రావణి, కల్యాణి పరీక్షలు నిర్వహించారు. సహాయత హెల్పింగ్ హ్యాండ్స్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో ఆర్.సన్యాసిరావు పాల్గొన్నారు.

ధ్యాన శిక్షణ ప్రారంభం

తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్ సంతోషి మాట్లాడుతూ ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, బుద్ధి కుశలత, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి... ఆందోళన, భయం, జీవితం పట్ల విరక్తి సంపూర్ణంగా తొలగించడానికి ధ్యానం దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా ధ్యానంతో హైబీపీ, మధుమేహం, గ్యాస్ట్రిక్, వెన్నునొప్పి, నిద్రలేమి, మానసిక, చర్మ, గర్భకోశ వ్యాధులు, ఆస్తమ్మా, సైనసైటిస్ నయమవుతాయన్నారు. ప్రతి సోమ, మంగళవారాల్లో ఉదయం 10 గంటల నుంచి 11 వరకు నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులను తగరపువలస, చిట్టివలస చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 81438 10608లో సంప్రదించాలని ఆమె సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీను

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్‌ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.